ఎస్ఎస్‌డీ విద్యార్థికి విఘ్నేశ్వర ఆర్ట్స్ నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న పూజిత

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్‌డీ యోగాశాల విద్యార్థికి ప్రతిష్టాత్మక నంది అవార్డు దక్కింది. విఘ్నేశ్వర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎస్‌డీ యోగాశాల విద్యార్థి పూజిత యోగాసనాలను ఎంతో సమతుల్యంగా, స్ప్రింగ్‌లా సునాయసంగా ప్రదర్శించి అందరిని ఆకట్టుకుంది. అత్యుత్తమ ప్రదర్శనతో పూజిత నంది అవార్డును కైవసం చేసుకుంది.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కూన రాఘవేంద్రగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు అందజేయనుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేంద్ర గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. మూడు కేటగిరీలో అర్హులైన నిరుద్యోగ యువతకు నియోజకవర్గానికి 4 వేల నుంచి 5 వేల మంది యువతకు ఈ అవకాశాలు కల్పించే దిశగా ఏర్పాటు చేసిందన్నారు. దరఖాస్తులు చేసుకున్న తరువాత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఎంపిక చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను పట్టించుకోలేదన్నారు.

మెడల్స్ అందజేత.. సన్మానం



కుత్బుల్లాపూర్: బూమ్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ పరిధిలో యువతకు వివిధ క్రీడలపై శిక్షణ ఇస్తూ 30 మందికి జూనియర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. కరాటే, స్కేటింగ్, కుంగ్‌ఫూ వంటి క్రీడలపై శిక్షణ ఇచ్చి వాటి ప్రాముఖ్యతపై పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి మెడల్స్ అందజేశారు. మాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. వారిని సన్మానించారు.

అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె రాజు పటేల్ ఎన్నికయ్యారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథన్, కోశాధికారి దయానంద్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ సింఘానియా, రవీందర్, సలహాదారుడు సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల అరెస్టు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడులు, అరెస్టుల అన్యాయమని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించడాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వర్సిటీ భూముల వేలం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు, ఇతర విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నగర కార్యదర్శి పృథ్వీతేజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏండ్లుగా ఎంతోమంది విద్యావంతులను అందించిన హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు విక్రయించాలనుకోవడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వర్సిటీల భూములు అమ్మడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.



జీడిమెట్ల డివిజన్ రామరాజునగర్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్



గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో నిర్వహించిన పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిజాంపేట్ అభయాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, గ్రామ పెద్దలు



బ్యాంక్ కాలనీ సాయిబాబా ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఉగాది పర్వదినం.. షడ్రుచుల సమ్మేళనం

- ఆలయాల వద్ద ఉగాది పచ్చడి అందజేత
- పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు

నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. ఉదయం నుంచి భక్తులు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలకు క్యూ కట్టారు. ఆలయాల్లో తీపి, పులుపు, కారం, చేదు, వగరు, ఉప్పుతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్



షిరిడీహిల్స్ నల్లపోచమ్మ ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు




దుండిగల్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో గోవుకు తినిపిస్తున్న గణపతి సచ్చిదానందస్వామిజీ



దూలపల్లిలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

రూ.55.01 కోట్ల పన్ను వసూళ్లు



నరసింహ, ఉప కమిషనర్ కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయ ముఖద్వారం

- టార్గెట్‌కు మించి వసూళ్లు
- నేడు అర్ధరాత్రి వరకు కౌంటర్లు

కుత్బుల్లాపూర్: పన్నుల వసూలు చేసే విషయంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు రెండు రోజుల ముందుగానే టార్గెట్ పూర్తి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.54.36 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకోగా.. ఈనెల 29వ తేదీ నాటికి రూ.55.01 కోట్లు వసూలు కావడం విశేషం. నెల రోజులుగా ప్రతి రోజు టార్గెట్ పెట్టుకొని ముందుకు సాగిన ఉప కమిషనర్ నరసింహ ఎట్టకేలకు టార్గెట్ పూర్తి చేయడంతో పాటు మరో ఐదు కోట్ల రూపాయలు అదనంగా వసూలు చేసేందుకు కృషి చేస్తున్నారు. గతంలో సైతం కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రేటర్ పరిధిలోని ఇంటి పన్ను వసూళ్ల విషయంపై మొదటి స్థానంలో ఉండగా.. తాజాగా గ్రేటర్ పరిధిలో ముందు వరుసలో ఉండే అవకాశం ఉంది. సమిష్టి కృషి వల్లే ఈ వసూళ్లు చేయడం జరిగిందని, ప్రజలు సైతం ముందుకు వచ్చి పన్నులు చెల్లించేందుకు సిద్ధం కావడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని ఉప కమిషనర్ నరసింహ తెలిపారు.

నేటి అర్ధరాత్రి వరకు ప్రత్యేక కౌంటర్లు

జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం రాత్రి 12 గంటల వరకు ఆస్తి పన్ను చెల్లింపు విషయంపై ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డిలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు సెలవుల్లో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా పన్నులు చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయి చెల్లింపు విషయంపై ఓటీఎస్ పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం ద్వారా వడ్డీలో 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించాలని కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎర్రగడ్డ, బోరబండ, అల్లాపూర్, శ్రీరామ్‌నగర్, రెహ్మత్‌నగర్‌లతో పాటు వివిధ ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రామాలయంలో ఆదివారం గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావు, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబురావు, ఆలయ చైర్మన్ తులసీరావ్, కూకట్‌పల్లి శివాలయం మాజీ చైర్మన్ నాయినేని సూర్యారావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమస్యలపై నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న బస్తీవాసులు

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయ్‌కుమార్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ దయానంద్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై ఆదివారం బీజేవైఎం నాయకులు బస్తీ యాత్ర నిర్వహించారు. పాడైన రోడ్లు, అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ సమస్యను స్థానికులు వారి దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ఈటలరాజేందర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం డివిజన్ నాయకులు బబ్లూ, రాజేష్, రాహుల్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాళీ స్థలంలో అక్రమంగా డెబ్రిస్ డంపింగ్



డెబ్రిస్‌ను డంప్ చేస్తున్న దృశ్యం

- పట్టించుకోని అధికారులు

రంగారెడ్డినగర్: భవన వ్యర్థాలను కట్టడి చేయడంలో అధికారుల చిత్తశుద్ధి కొరవడింది. దీంతో పగటిపూట కూడా ట్రాక్టర్లలో డెబ్రిస్‌ను తీసుకొచ్చి ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్‌లను ఆనుకుని వందలాది ఎకరాల్లో హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం ఉంది. ఈ స్థలాలపై హెచ్ఎంటీ పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందిని నియమించినా అంతంత మాత్రంగానే విధులు నిర్వహిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన డెబ్రిస్ డంపింగ్ మాఫియా ట్రాక్టర్లలో నిర్మాణ వ్యర్థాలను తెచ్చి పారబోస్తున్నారు. వారిని అడిగే వారే లేకపోవడంతో డంపింగ్ దందా నిరాటకంగా కొనసాగుతోంది. ఇప్పటికైనా సర్కిల్, హెచ్ఎంటీ అధికారుల సమన్వయంతో వ్యవహరించి అక్రమ డంపింగ్‌ను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘బ్రాహ్మణులపై ద్వేషభావం విడనాడాలి’



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ గోపాల్

సనత్‌నగర్: బ్రాహ్మణులపై ద్వేషభావం విడనాడాలని బేగంపేటలోని పుష్పగిరి జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం పీఠాధిపతి విద్యాశంకర భారతి అన్నారు. పలువురు మేధావులు, ప్రముఖుల సమక్షంలో సెంటర్ ఫర్ బ్రాహ్మణ్ ఎక్స్‌లెన్స్ సంస్థను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రాహ్మణ ఐక్యతకు అమలుచేయాల్సిన మార్గదర్శకాలు, యువత భవిష్యత్తుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై బ్రాహ్మణ్ ఎక్స్‌లెన్స్ పనిచేస్తుందన్నారు. బ్రాహ్మణ ప్రముఖులు, రాజకీయ నేతలు, వివిధ రంగాల నిపుణులు సంస్థ పురోగతికి సహకరించాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎల్వీ సుబ్రమణ్యం, ఏజీ గోపాల్, మాజీ డీజీపీ అరవిందరావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పీవీ ప్రభాకర్ రావు, పాత్రికేయులు రామశర్మ, ఆర్థికవేత్తలు ఎం వీరావు, హరిబాబు తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఒద్దిరాజు విజయ్, ప్రధాన కార్యదర్శి వనం జ్వాలా నర్సింహారావు, పుష్పగిరి పీఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ‘శ్రీరామ లిఖితం’



శ్రీరామ నామ లిఖితం కార్యక్రమంలో చిన్నారులు

సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని హనుమాన్ కళావేదిక వద్ద ‘శ్రీరామ నామ లిఖితం’ కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరామ నామం ఉచ్ఛరిస్తూ భక్తి తన్మయత్వంలో మునిగిపోయి శ్రీరామ నామ లిఖితం చేశారు.. అనంతరం పిల్లలకు ఆశీర్వచనం, ప్రసాద వితరణ చేశారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ప్రతినిధి దండా బుచ్చిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆలయ ఈఓ సత్యనారాయణ, ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, శ్రీవిష్ణు సహస్రనామ సత్సంగ సభ్యులు హాజరయ్యారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ -జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలోని పట్టాల పక్కనుంచి శనివారం రాత్రి 7.15 గంటల సమయంలో సుమారు 30–35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన రైలు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం

- 30 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ప్రణాళిక
- ధాన్యం కొనుగోళ్లకు 12 కేంద్రాల ఏర్పాటు



ధాన్యం సేకరణ కేంద్రాలివే

సాక్షి,సిటీబ్యూరో: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యమంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పెరిగిన వరి సాగు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా.. రైతులు మాత్రం 11,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

కేంద్రం ప్రకటించిన ధరతోనే కొనుగోలు

రైతులను అన్నీ విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు.

అన్ని రకాల సౌకర్యాలు

టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఎండలు మండుతుండటంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ, అదనంగా 1.30 లక్షల గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచారు.

మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం (ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పురా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్‌పేట్, అలియాబాద్, కీసర మండల కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

యాసంగి ధాన్యమంతా కొంటాం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, రైతు ప్రతినిధులు, హమాలీలు, రైస్ మిల్లర్లతో ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించాలి.

– సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్